సాక్షి శ్రీకాకుళం

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



పల్లె ముంగిట..

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం కానుంది. పల్లెల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. - 8లో



ఒత్తిడిని జయిస్తేనే..

వరల్డ్ హార్ట్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలో జెమ్స్, కిమ్స్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గుండె జబ్బులపై అవగాహన కల్పించారు. - 8లో

అండర్ 19 తైక్వాండో, బాక్సింగ్, కుస్తీ ఎంపికలు రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్‌జీఎఫ్ అండర్-19 తైక్వాండో, బాక్సింగ్ క్రీడాకారుల ఎంపికలు అక్టోబర్ 1న నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్ 19 కార్యదర్శి ఎస్.రామన్న శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో ఉదయం పది గంటలకు ఈ ఎంపికలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. కుస్తీ పోటీల ఎంపికలు సైతం ఆదివారం ఉదయం 10 గంటలకు పెద్దపాడులోని హనుమాన్ వ్యాయామ శాలలో జరుగుతాయని అన్నారు.

న్యూస్‌రీల్

1, 2 తేదీల్లో కిరణ స్పర్శ దర్శనం



స్వామి వారి మూలవిరాట్టుపై కిరణాల వెలుగులు (ఫైల్)

అరసవల్లి: ఆదిత్య క్షేత్రంలో అపురూప క్షణాలకు వేళయ్యింది. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఉత్తరాయణ, దక్షిణాయణ కాలమార్పుల్లో భాగంగా తొలి సూర్యకిరణాలు నేరుగా మూలవిరాట్టును తాకే అరుదైన క్షణాలు అక్టోబర్ 1, 2 తేదీల్లో సూర్యోదయ సమయాన సాక్షాత్కరించనున్నాయి. ఈ మేరకు ఆలయంలో దర్శన ఏర్పాట్లను పక్కాగా చేపడుతున్నట్లుగా ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు శుక్రవారం తెలియజేశారు. కిరణ దర్శనం కోసం ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ముందుగా అరసవల్లి క్షేత్రానికి తరలిరానున్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లను శుక్రవారం నుంచే ఆలయంలో మొదలుపెట్టారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఏర్పాట్ల పరిశీలన



జగనన్న ఆరోగ్య సురక్ష ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా వైద్య అధికారి మీనాక్షి

జలుమూరు: రోగులకు పూర్తిస్థాయి వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. లింగాలవలసలో మొట్టమొదటిగా ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఏర్పాట్లను శుక్రవారం రాత్రి పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఈ శిబిరంలో పూర్తిస్థాయి సమాచారం హెల్ప్ డెస్క్‌లో ఉంచాలన్నారు. ఇంటింటా సర్వే వివరాలు వైద్య శిబిరంలో అందించాలన్నారు. ఆమెతో పాటు మెడికల్ అధికారి డాక్టర్ తాడేల శ్రీకాంత్,డిప్యూటీ పారామెడికల్ అధికారి వాన సురేష్ కుమార్, సీహెచ్‌ఓ పద్మావతి, హెచ్ఎస్ చిన్నరాజులు సిబ్బంది ఉన్నారు.

'ప్రణాళికాబద్ధంగా ప్లానింగ్ ప్రక్రియ'

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ప్లానింగ్ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జీవీ చిట్టి రాజు సిబ్బందిని ఆదేశించారు. డ్వామా కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని అన్ని మండలాల ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లతో ప్లానింగ్ ప్రక్రియపై శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి క్షేత్రస్థాయిలో పనుల గుర్తింపు, ఎస్టిమేషన్లు వేసే కార్యక్రమాన్ని అక్టోబర్ రెండో తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామపంచాయతీలో చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు. ప్లానింగ్ ప్రక్రియలో అలసత్వం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ మేనేజర్ స్వరూప రాణి, జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఏపీడీలు పి.రాధ, మురళీకృష్ణ, లోకేష్ తదితరులతో పాటు ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ. చిత్రంలో మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతి తదితరులు

రాష్ట్రానికి రక్ష జగనన్న ఆరోగ్య సురక్ష

- ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర వహించండి: మంత్రి బొత్స
- ప్రజారోగ్యాన్ని కాపాడటమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం: మంత్రి ధర్మాన
- ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నదే సీఎం జగన్ సంకల్పం: మంత్రి సీదిరి
- సంక్షేమమే అండగా మన జెండా ఎగరేద్దాం: పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్
- 'జగనన్న ఆరోగ్య సురక్ష'పై వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, మరో ఆరు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు రానున్న తరుణంలో వైఎస్సార్ సీపీ నాయకులంతా గేర్ మార్చాలని పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రతి గ్రామంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, అభిప్రాయ భేదాలు ఉంటే దాని ప్రభావం పార్టీపై పడకుండా చూసుకోవాలన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను సహించేది లేదని స్పష్టం చేశారు. శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో జగనన్న ఆరోగ్య సురక్షపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష ' కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, కార్పొరేషన్ చైర్మన్లు, గృహసారథులు, వలంటీర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పార్టీ కార్యకర్తలు పాల్గొని ఇంటింటికి వెళ్లాలని సూచించారు. అనారోగ్యంతో బాధ పడేవారికి కావాల్సిన పరీక్షలు, మందులు అందించడంతో పాటు ఆపరేషన్లు ఏవైనా చేయాల్సి వస్తే అందుకు తగిన సహకారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా ఇలాంటి కార్యక్రమం లేదని, ఒక్క ఏపీలోనే జరుగుతోందన్నారు. అలాగే ఆంధ్ర రాష్ట్రానికి ఎందుకు జగనే కావాలనే మరో కార్యక్రమం విషయాల్ని ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. అక్టోబర్ 11 నుంచి ఆ కార్యక్రమం చేపట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను సచివాలయాల్లో డిస్‌ప్లే చేసి వివరించాలని సూచించారు. పల్లెనిద్ర కార్యక్రమం ప్రతి నియోజకవర్గంలో విధిగా నిర్వహించాలన్నారు. టీడీపీ నేతలు, ఎల్లో మీడియా మాయమాటలు చెప్పి మరోసారి ప్రజలకు మోసగించేందుకు ప్రయత్నం చేస్తున్నాయని, వాటిని తిప్పి కొట్టాలన్నారు. జిల్లాలో గతంలో ఓడిన రెండు సీట్లు గెలిచి తీరాలని దిశానిర్దేశం చేశారు.

సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, పేరాడ తిలక్, అంధవరపు సూరిబాబు, కాయల వెంకటరెడ్డి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంవీ స్వరూప్, డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చింతాడ వరుణ్, ధర్మాన కృష్ణచైతన్య, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, శిమ్మ రాజశేఖర్, పొన్నాడ రుషి, చింతాడ మంజు, ఎన్ని ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ముఖ్యం..



అధికారులతో పాటు వలంటీర్లు కూడా జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొనాలి. ఆరోగ్యం విషయంలో చాలా చిన్న కుటుంబాలు చితికిపోతున్నాయి. అలాంటి వారికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. చాలా మంది ఎన్నో అనారోగ్య సమస్యలు ఉన్నా.. ఎక్కడకు వెళ్లాలో తెలీక సతమతమవుతున్నారు. అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వ సాయం అందించాలి. ప్రభుత్వ ఆస్పత్రి అంటే చాలా మందిలో చులకన భావం ఉంది. దాన్ని తొలగించాలి. సీఎం వైఎస్ జగన్ పట్టుబట్టి మరీ 55 వేల మంది వైద్య సిబ్బందిని నియమించారు. నాకు కోవిడ్ వచ్చినప్పుడు ప్రభుత్వ ఆస్పత్రిలోనే చికిత్స తీసుకున్నాను. జగనన్న సురక్షను విజయవంతం చేసినట్టుగానే జగనన్న ఆరోగ్య సురక్షను కూడా విజయవంతం చేయాలి.

– ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ మంత్రి



పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

క్లీన్‌స్వీప్ చేయాలి..



రానున్న ఎన్నికల్లో జిల్లాలో క్లీన్‌స్వీప్ చేయాలి. పదవులు వచ్చిన వారు గొప్ప కాదు. ఒక్కోసారి ఒక్కొక్కరికి అవకాశాలు వస్తాయి. సీఎం వైఎస్ జగన్ లాంటి నాయకుడు రాష్ట్రానికి అవసరం అనే విషయాన్ని అందరికీ వివరించాలి. ప్రజలందరి కృషి, శ్రమ ఫలితమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోగానే అచ్చెన్నాయుడు తిరుపతిలో పార్టీ లేదు.. ఏమీ లేదన్నారు. ఇప్పుడు మళ్లీ టీడీపీపై మొసలి కన్నీరు కారుస్తున్నారు. మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి చంద్రబాబు సీఎం అయ్యారు. ఆ తర్వాత కూడా ఏదో ఒక పార్టీతో పొత్తు కడుతూ రాజకీయ జీవితం కొనసాగించారు. పొత్తు అవసరం లేకుండా బరిలోకి దిగేది వైఎస్ జగన్ ఒక్కరే. టీడీపీ అబద్ధాలు, మోసాలు ప్రజలందరికీ వివరించాలి. పార్టీలో తప్పు చేస్తే ఎంతటి వారికైనా అందుకు తగిన శిక్ష తప్పదు.

– ధర్మాన కృష్ణదాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ సీఎందే..



విద్య, వైద్యం, ఆరోగ్యం ఇవి సామాన్యులకు చాలా అవసరం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు వీటిని అందిస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తీసుకువచ్చింది సీఎం వైఎస్ జగనే. ప్రజారోగ్యాన్ని కాపాడుతూ మరణాల రేటు తగ్గించి ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే సీఎం లక్ష్యం. ఇలాంటి బృహత్తరమైన కార్యక్రమం దేశంలో ఏ రాష్ట్రంలో ఇప్పటివరకు చేపట్టలేదు. అందుకే జగనే కావాలి.. జగనే రావాలి. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్ జగన్ రాష్ట్రానికి ఎందుకు అవసరమో వివరించాలి. పలాస నియోజకవర్గంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహణ ఖర్చు అంతా నేనే భరిస్తా.

– డాక్టర్ సీదిరి అప్పలరాజు, పశుసంవర్ధకశాఖ మంత్రి

ఆధారాలు ఇక భద్రం

- క్రైమ్ సీజ్డ్ ప్రాపర్టీ నిక్షిప్తం కోసం సాంకేతిక సాయం
- ఈ-మాల్‌ఖానా సాఫ్ట్‌వేర్‌తో ప్రాపర్టీ వివరాలు భద్రం
- సాంకేతికతను వాడుకుంటున్న పోలీసు శాఖ



స్కాన్ చేయగానే మొబైల్‌లో ఇలా ప్రాపర్టీ వివరాలు ప్రత్యక్షమవుతాయి

శ్రీకాకుళం క్రైమ్ : కేసులో దర్యాప్తు ఎంత ముఖ్యమో..ఆ దర్యాప్తులో లభించిన ఆధారాలను నిక్షిప్తం చేయడం కూడా అంతే ముఖ్యం. హత్య కేసులో దొరికిన ఆయుధాలు, లైంగిక వేధింపుల కేసుల్లో దొరికే ఆధారాలు, పోయిన సెల్‌ఫోన్లు, ఆత్మహత్య కేసుల్లో లభించే సూసైడ్ నోట్‌లు, అనుమానాస్పద వస్తువులు.. ఇలాంటి వన్నీ పోలీసులు చాలా జాగ్రత్తగా భద్రపరచాలి. ఇందుకోసం పోలీసులు కొత్తగా సాంకేతిక సాయం తీసుకుంటున్నారు. గతంలో క్రైమ్ సీన్‌లో పోలీసులకు దొరికిన ప్రాపర్టీ ఏదైనా వెంటనే సీజ్ చేసి ఓ బాక్స్‌లో పెట్టి దానిపై తెల్ల కాగితం అంటించి క్రైమ్ నంబర్, తదితర వివరాలు రాసి పీఎస్ స్టోర్ రూమ్‌లో ఉంచేవారు. ఆ తెల్ల కాగితం చిరిగిపోతే ఇక అంతే సంగతులు. కానీ ఇప్పుడు సాంకేతికతను అందుకున్న పోలీసులకు ప్రభుత్వం కూడా సహా య సహకారాలు అందిస్తుండటంతో సీజ్డ్ ప్రాపర్టీ వివరాలు నిక్షిప్తం చేసేలా కొత్త సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ ఈ-మాల్‌ఖానాను ప్రవేశ పెట్టారు. సింపుల్‌గా చెప్పాలంటే ఇది ఒక సైంటిఫిక్ ప్రాపర్టీ స్టోరేజ్ సిస్టమ్ అంటే శాస్త్రీయ ఆస్తి నిల్వ వ్యవస్థ. రాష్ట్రమంతా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలోనూ దీనిని అమలు చేస్తున్నారు.



బాక్స్‌పై క్యూఆర్‌కోడ్

డేటా ఎలా పొందుపరుస్తారంటే..

సీజ్ ప్రాపర్టీని క్యూఆర్‌కోడ్ (బార్‌కోడ్)తో కౌంటింగ్ చేస్తుంది. ఆ సాఫ్ట్‌వేర్‌లో డేటా ఎంటర్ చేసి ఓకే కొడితే క్యూ ఆర్ బార్‌కోడ్ జనరేట్ అవుతుంది. ఆ క్యూఆర్ కోడ్‌ను ప్రింట్ తీసి కేసుకు సంబంధించిన ఫైల్‌ల మీద, ప్రాపర్టీ పెట్టిన బీరువా లేదా ర్యాక్ మీద లేదా బాక్స్‌పైన అంటిస్తారు.

ఎలా పనిచేస్తుంది..?

ప్రతి కేసుకు ఓ క్యూఆర్‌కోడ్ ఉంటుంది. స్టేషన్ స్టోర్ రూమ్‌లో ఉన్న ప్రాపర్టీ బాక్సులకు క్యూఆర్‌కోడ్ అంటిస్తారు. దాన్ని పీఎస్‌కు సంబంధించి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ అనుసంధానిస్తారు. స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఆధీనంలో ఉంటుంది. సీజ్డ్ ప్రాపర్టీ విషయాలు అత్యవసర పరిస్థితుల్లో తెలుసుకోవాలనుకుంటే వెంటనే తమ మొబైల్ ద్వారా క్యూఆర్‌కోడ్‌కు కనెక్ట్ అయితే పీఎస్ నేమ్, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్, క్రైమ్ నంబర్, యాక్ట్ అండ్ లా, డేట్ ఆఫ్ ఎఫ్ఐఆర్, ప్రాపర్టీ ఇన్ఫర్మేషన్, ఐటెమ్ ఇమేజ్ వివరాలన్నీ వస్తాయి.



మొబైల్‌తో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వివరాలు పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

ఎవరికి ఉపయోగమంటే..?

సంబంధిత పీఎస్‌కు చెందిన ఎస్ఐలకు, సీఐలకు, డీఎస్పీలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. కోర్టుకు ప్రాపర్టీ సబ్మిట్ చేసేప్పుడు, ఉన్నతాధికారులెవరైనా ఆకస్మిక తనిఖీలకు వచ్చేటప్పుడు వెంటనే చూపించడానికి వీలుంటుంది. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో సీజ్డ్ ప్రాపర్టీ విషయాలు పొందుపర్చడంతో ప్రాపర్టీలో ఎలాంటి అవకతవకలు జరగవు. పక్కా సమాచారం పారదర్శకతతో ఉంటుంది.

14,324 మందికి రూ.14.32 కోట్లు

- వైఎస్సార్ వాహన మిత్ర నిధుల విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ వాహన మిత్ర ఐదో ఏడాది నిధులు శుక్రవారం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో రవాణా శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం శుక్రవారం జరిగింది. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ విజయవాడ విద్యాధరపురంలో బటన్ నొక్కి నిధులు విడుదల చేశారని, జిల్లాలో 14,324 మందికి రూ.14.32 కోట్లు వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేస్తామని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు అతిథులతో కలిసి నమూనా చెక్కు, సీఎం పంపిన సందేశ పత్రాలను అందజేశారు.

2019 అక్టోబర్ 4న ప్రవేశపెట్టిన ఈ పథకం కింద జిల్లాలో 13,539 మంది లబ్ధిదారులకు రూ.13.53 కోట్లు, 2020-21లో కోవిడ్ పరిస్థితి కారణంగా లబ్ధిదారులు జీవనోపాధి కోల్పోవడాన్ని దృష్టిలో ఉంచుకుని 4 నెలలు ముందుగానే 15,484 మందికి రూ.15.45 కోట్లు, 2021-22లో 14,978 మందికి రూ.14.98 కోట్లు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. 2022-23లో 13,492 మందికి రూ.13.49 కోట్లు, 2023-24 లో 14,324 మందికి రూ.14.32 కోట్లు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, రవాణాశాఖ అధికారులు

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందుతున్నాయన్నారు. వాహన మిత్ర పథకం ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్, వాహన యజమానుల కళ్లలో ఆనందం నింపుతుందని అన్నారు.
- ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. వాహన డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటించి అందరిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని కోరారు.
- ఉప రవాణా కమిషనర్ ఎస్.శివరామ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 14,324 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి కేసులు రాయకుండా ఆటోరిక్షా, టాక్సీ, మ్యాక్స్ క్యాబ్ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఉప రవాణా కమిషనర్ ఎస్.శివరామ ప్రసాద్, ఆర్టీఓ మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఎంతో మేలు



వాహన మిత్రతో ఆటో డ్రైవర్లకు ఎంతో మేలు. అర్హత ఉన్న ప్రతి ఒక్క ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్, వాహన యజమానుల కళ్లలో జగనన్న ఆనందం నింపారు. ఎప్పటికీ రుణపడి ఉంటాం. – బొత్స గోపాలకృష్ణ, లబ్ధిదారు, నరసన్నపేట

బీమా నగదు తగ్గించారు



మూడేళ్లుగా ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రజల వద్దకే వెళ్లి రేషన్ అందిస్తున్నాం. మాకు ఇన్స్యూరెన్స్ రేట్లు పెరిగాయి. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో ఆ బీమా నగదును తగ్గించారు. ఆ డబ్బు కూడా ప్రభుత్వం తరపునే చెల్లించేలా మా వాహనాలను వాహన మిత్ర పథకంలో చేర్చారు. సీఎంకు మా యూనియన్ తరపున కృతజ్ఞతలు.

– రౌతు సూర్యనారాయణ, ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు

క్లుప్తంగా

లోలుగు వద్ద 108 వాహనం బోల్తా

పొందూరు: మండలంలోని లోలుగు వద్ద గురువారం అర్ధరాత్రి సంతకవిటి మండలానికి చెందిన 108 వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. సంతకవిటి నుంచి జ్వరంతో బాధపడుతున్న మహిళను శ్రీకాకుళం తీసుకెళ్తుండగా లోలుగు కాలనీ సమపంలో మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 108 సిబ్బందితో పాటు మహిళకు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే మరో వాహనంతో శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రికి. బోల్తా పడిన 108 వాహనాన్ని జేసీబీ సహాయంతో పైకిలేపి మరమ్మతుల కోసం విశాఖకు తరలించారు.

రాష్ట్ర పోటీలకు జిల్లా జట్లు పయనం



జిల్లాకు ఎంపికైన క్రీడాకారులకు దుస్తులను పంపిణీ చేస్తున్న దాత ఆదినారాయణ, రమేష్, కోచ్ మధు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నంద్యాల వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి సబ్-జూనియర్స్ బాలబాలికల బాల్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్-2023 పోటీలకు జిల్లా జట్లు శుక్రవారం ఇక్కడి నుంచి బయల్దేరి వెళ్లాయి. వీరికి బాల్ బ్యాడ్మింటన్ మైదానంలో క్రీడాదుస్తులు, కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా స్పాన్సర్‌షిప్ అందించిన ఆదినారాయణ మాస్టారు మాట్లాడుతు గతంలో ప్రతి పల్లెల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడలకంటే బాల్ బ్యాడ్మింటన్‌ను ఎక్కువగా ఆడేవారని గుర్తుచేశారు. కాలక్రమేణా ఆటకు ప్రాధాన్యత తగ్గినప్పటికీ.. మళ్లీ కొంతమంది ప్రోత్సాహంతో పుంజుకుందన్నారు. విజయాలతో ట్రోఫీని సాధించి కోచ్‌లకు గురుదక్షిణగా ట్రోఫీని అందివ్వాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పక్కి రమేష్, కోచ్ ఎం.మధుసూధనరావు, సీనియర్ క్రీడాకారులు చిరంజీవి, ఆర్.కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

దొంగలా మారిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

- చోరీకి పాల్పడిన బంగారం, నగదు స్వాధీనం



మాట్లాడుతున్న డీఎస్పీ చక్రవర్తి

రాజాం సిటీ: ఇంజినీరింగ్ చదువుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడిన శ్రీకాకుళం మండలం కరజాడ గ్రామానికి చెందిన బలగ హరిబాబు దొంగలా మారాడు. జల్సాలతో పాటు బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పులపాలై ఆర్థిక ఇబ్బందులు పడ్డాడు. ఈ క్రమంలో దొంగతనాల వైపు తన దృష్టి మళ్లించాడు. ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాలను చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం వెల్లడించారు. ఓ కేసులో వరంగల్ పోలీసులు అరెస్టు చేసి విడుదల చేసిన అనంతరం హరిబాబు శ్రీకాకుళం వచ్చాడు. అక్కడ తెలిసిన వారి వద్ద రూ.6 లక్షల వరకు అప్పులు చేసి వాటిని తీర్చేందుకు దొంగతనాన్ని ఎంచుకుని తన మేనత్త ఇంట్లోనే చోరీకి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా మరికొన్ని నేరాలకు పాల్పడి శ్రీకాకుళంలో పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లాడు. శిక్ష అనుభవించి ఆగస్టు 23న విడుదలై వచ్చాడు. ఈ నెల 18న రాజాంలోని వాసవినగర్‌లో నివాసం ఉంటున్న జి.సిగడాం మండలం ఎందువ గ్రామానికి చెందిన గొద్దు వెంకటరమణ ఇంటిలో చోరీకి పాల్పడి బంగారు నెక్లెస్‌లు, చెవి దిద్దులు, గాజులు, హారాలతోపాటు నగదు పట్టుకుపోయాడు. అక్కడి నుంచి విశాఖపట్నం వెళ్లి ఐఐఎఫ్ఎల్ బ్యాంకులో నాలుగు గాజులు, ఒక హారం తాకట్టు పెట్టాడు. బాధితుల ఫిర్యాదు మేరకు చేపట్టిన దర్యాప్తులో భాగంగా నిందితుడిని రణస్థలం సమీపంలో పట్టుకుని 241 గ్రాముల బంగారం, రూ.50వేల నగదు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నామన్నారు. ఈ కేసును ఛేదించిన సీఐ కె.రవికుమార్, ఎస్సై రవికిరణ్‌లను ఆయన అభినందించారు.

ముగిసిన స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా విద్యాశాఖ పరిధిలోని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి మొదలైన ఈ ఎంపికలు శుక్రవారం సాయంత్రంతో ముగిశాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా ఆఖరి రోజు క్రికెట్, అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించారు. డీఈఓ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ బీవీ రమణ, పీఈటీ అసోసియేషన్ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, కె.మాధవరావు, పీడీలు పర్యవేక్షించారు. పోటీలు ప్రశాంతంగా ముగియడంతో నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఊపిరి పీల్చుకున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

పల్లె ముంగిట.. ఆరోగ్య శిబిరం

- నేటి నుంచి జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష
- నవంబర్ 3 వరకు శిబిరాల నిర్వహణ
- జిల్లాలో 669 విలేజ్ హెల్త్ క్లినిక్స్ పరిధిలో 607 శిబిరాల ఏర్పాటు



బూర్జ మండలం ఓవీ పేటలో ఇంటి గడపలోనే వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

అరసవల్లి: జిల్లాలో నేటి నుంచి గడప గడపకూ ప్రభుత్వ వైద్యసేవలు అందనున్నాయి. వైద్యులు ఉన్న ఊరికే వచ్చి రోగ లక్షణాలు ఉన్న వారికి అక్కడే తక్షణ వైద్య పరీక్షలు చేస్తారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట నేటి నుంచి నవంబర్ 3వరకు జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య సేవలు అందించనున్నారు. సెప్టెంబర్ 16 నుంచి ఇంటింటికీ సర్వే చేయించిన వైద్యారోగ్య శాఖ ఇప్పటికే రోగుల జాబితాను కూడా సిద్ధం చేసింది.

సూపర్ స్పెషాలిటీ వైద్యుల సమక్షంలోనే..

ఇప్పటికే మెడికల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా సూపర్ స్పెషాలిటీ వైద్యుల సమక్షంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. ఈనెల 30 నుంచి నవంబర్ 3 వరకు వైఎస్సార్ విలేజి హెల్త్ క్లినిక్‌ల వద్ద సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టనుంది. ఆరోగ్య సురక్ష ద్వారా ఇప్పటి కే ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని చేపట్టింది. అనారోగ్య పీడితులను గుర్తించి వైద్య శిబిరాల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. నవంబర్ 3వ తేదీ వరకు మొత్తం 607 వైద్యశిబిరాలకు కార్యాచరణ సిద్ధం చేసింది. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా అధునాతన చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టింది. ఆరోగ్య సురక్ష అమలు కోసం జిల్లా నోడల్ ఆఫీసర్‌గా స్థానిక డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.ప్రసాదరావును కలెక్టర్ నియమించారు.

ముమ్మరంగా ఇంటింటి సర్వే

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు సంబంధించిన ప్రచార కార్యక్రమంలో భాగంగా ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, వలంటీర్లు ఇప్పటికే క్షేత్రస్థాయిలో ముమ్మరంగా సర్వే చేస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబసభ్యుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, టీబీ, మలేరియా, టైఫాయిడ్‌ల నిర్ధారణకు రక్త పరీక్షలు, థైరాయిడ్ వంటి ఏడు రకాల పరీక్షలు నిర్వహించి కేస్ షీట్స్ సిద్ధం చేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. అనంతం వారికి కూపన్లు అందజేస్తున్నారు. ఆ కూపన్లతో ప్రజలు ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలకు వెళ్లి వైద్య సేవలు పొందవచ్చు. 118 రకాల ఔషధాలు అందుబాటులో ఉంటాయి. అత్యాధునిక చికిత్స అవసరమైతే వైద్యులు సమీపంలో ఆస్పత్రికి తరలించి ఉచితంగా వైద్యం అందిస్తారు. శస్త్రచికిత్సలు అవసరమైనా ఆరోగ్యశ్రీ ద్వారా చేస్తారు. రోగులు కోలుకునే వరకు పర్యవేక్షించేలా ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ విలేజి హెల్త్ క్లినిక్‌లతో అనుసంధానం చేస్తారు. జిల్లాలో ఇప్పటికే ఎచ్చెర్ల మండలం అల్లినగరంలో పైలెట్ ప్రాజెక్టుగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించి సఫలమయ్యారు.



ఇంటింటి సర్వేలో రోగుల సమాచారం ఇలా..		కిడ్నీ	1208
		క్యాన్సర్	488
విలేజీ హెల్త్ క్లినిక్	669	పక్షవాతం	95435
జనాభా	10,93,899	కంటి జబ్బులు	5752
జ్వరాల బాధితులు	39,699	దంత సమస్యలు	928
		ఎడోలసెంట్	8210
బీపీ	14,589	దగ్గు	802
మధుమేహం	24,510	రక్తహీనత చర్మ సమస్యలు	130
థైరాయిడ్	1886		

పక్కాగా ఆరోగ్య సేవలు



జగనన్న ఆరోగ్య సురక్ష కింద మొత్తం 607 వైద్య శిబిరాలను 30 మండలాల్లో ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, డీఎంహెచ్ఓ మీనాక్షిల ఆధ్వర్యంలో అన్ని విలేజి హెల్త్ క్లినిక్‌ల వద్ద ఏర్పాట్లు చేశాం. ఇంటింటికీ వెళ్లి 7 రకాల పరీక్షలు నిర్వహించనున్నారు. వైద్య శిబిరాలు సూపర్ స్పెషాలిటీ వైద్యుల సమక్షంలోనే జరుగనున్నాయి. శనివారం తొలి రోజున 30 మండలాల్లో 27 చోట్ల మెడికల్ క్యాంపులను ప్రారంభించనున్నాం.

– డాక్టర్ ఎం.ప్రసాదరావు, నోడల్ ఆఫీసర్

● హరిత విప్లవ జ్యోతికి నివాళి



స్వామినాథన్ చిత్రపటానికి పుష్పాంజలి

భారత హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతికి ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి జిల్లాలోని ఆర్.సీతాపురంలో ఉన్న సెంచూరియన్ వర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో శుక్రవారం సంతాపం తెలియజేశారు. ఎంఎస్ స్వామినాథన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డా.ఎం.దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి జ్యోతిని వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మన దేశంలో ఏ ఒక్కరూ ఆకలితో చనిపోకూడదు అనేదే స్వామినాథన్ ఆశయమన్నారు. వ్యవసాయ రంగంలో ధాన్యం, గోధుమల పంట అధిక దిగుబడికి అనేక పరిశోధనలు చేశారని తెలియజేశారు. చెన్నైలో అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. వ్యవసాయ రంగంలో పరిశోధనలకు గానూ ఆయనకు అనేక అవార్డులు వరించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ ప్రొఫెసర్అనిల్ కుమార్, డీన్ డా.ఎస్.పి.నందా, డైరెక్టర్ (అడ్మిషన్స్) డా.దుర్గాప్రసాద్ పాఢి, డా.పి.కల్యాణ చక్రవర్తి, ఎం.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. – పర్లాకిమిడి

ఒత్తిడిని జయిస్తే గుండె పదిలం



గుండెను పదిలంగా ఉంచుకోవాలంటూ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: ఒత్తిడిని జయిస్తే గుండెను పదిలంగా ఉంచుకోవచ్చని శ్రీకాకుళం నగర కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. శ్రీకాకుళం పరిధిలోని డేఅండ్ నైట్ కూడలిలో శుక్రవారం జెమ్స్, కిమ్స్ ఆస్పత్రుల సౌజన్యంతో జెమ్స్ వైద్య విద్యార్థులంతా కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగ తాగడం ఆపాలని, బీపీ, సుగర్ వ్యాధులను అదుపులో ఉంచుకోవాలని సూచించారు. జిల్లా అదనపు వైద్య శాఖాధికారి అనురాధ మాట్లాడుతూ అధిక కొవ్వు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరుగుతుందన్నారు. దీనిద్వారా హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. బాదంపప్పు, వాల్‌నట్స్‌లో ఎక్కువగా పోషకాలు ఉంటాయని తగిన మోతాదుల్లో తీసుకుంటే మన గుండె పదిలంగా ఉంటుందన్నారు. జెమ్స్ ఆస్పత్రిలో గుండె సంబంధిత పరీక్షలు ఉచితంగా జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

కార్యక్రమంలో జెమ్స్ వైద్యులు సుధీర్, కార్డియాలజిస్ట్ విజయ్, సాయితేజ, కళ్యాణ్ చక్రవర్తి, సతీస్, ఆర్ఎంఓలు బాలమురళీ, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుచోట్ల నూతన బ్రాంచ్‌లు ఏర్పాటు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, సీఈఓ వరప్రసాద్

పోలాకి: జిల్లాలో కొత్తగా ఏడుచోట్ల డీసీసీబీ బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తున్నామని డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు సీఈఓ డి.వరప్రసాద్‌లు తెలిపారు. శుక్రవారం పోలాకి పీఏసీఎస్ మహా జనసభకు హాజరైన అనంతరం వారు ఉమ్మడిగా విలేకరులతో మాట్లాడారు. పోలాకి, నందిగాం, చిలకపాలెం, కంచిలి, కొల్లివలస, పూండి, సంతబొమ్మాళిలలో డీసీసీబీ బ్రాంచ్‌లు ఈ ఆర్థిక సంవత్సరంలోనే అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో డీసీసీబీ ద్వారా తొలి సారిగా ఎడ్యుకేషన్ రుణాలు ఇస్తున్నామని, ఇప్పటి వరకు 11 మందికి రూ.2.6కోట్లు అందించామని చెప్పారు. జిల్లాలో 2.92 లక్షల మంది ఖాతాదారులున్న డీసీసీబీ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాలుగా చేయూత అందించటంపై చైర్మన్ కరిమి రాజేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. సంఘాలన్నింటినీ ఆన్‌లైన్ చేయటం ద్వారా పూర్తి పారదర్శకంగా సేవలు అందిస్తున్నామని ప్రకటించారు.

'అన్ని రంగాల్లో దళితులు ప్రగతి సాధించాలి'



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సునీల్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: దళితులు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణ శాఖ డీజీపీ, అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపకులు పీవీ సునీల్ కుమార్ అన్నారు. చిలకపాలేంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం, అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన ఎచ్చెర్లలో బాలికల అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. 10వ తరగతిలో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థినులకు నగదు బహుమతులను అందజేశారు. చిలకపాలెంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ దళితుల సామాజిక న్యాయం, ప్రగతి లక్ష్యంగా ఆరేళ్ల కిందట అంబేడ్కర్ ఇండియా మిషన్ స్థాపించినట్లు చెప్పారు. 500 జనాభా దాటిన దళిత వాడలను పంచాయతీలుగా ప్రకటించాలన్నారు. భవిష్యత్‌లో ప్రతి దళిత వాడ ప్రగతి సాధించాలని, హక్కులు, నిధుల కోసం నిలదీయాలని చెప్పారు. విద్యతో మాత్రమే పేదరికం అంతమవుతుందని, విద్యకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో సినీనిర్మాత బలగ ప్రకాష్, ఎ.ఐ.ఎం జిల్లా కన్వీనర్ తైక్వాండో శ్రీను, పలు సంఘాల నాయకులు కళ్లేపల్లి రాంగోపాల్, కంఠా వేణు, దాలినాయుడు, డొంక వెంకటరమణ, పుట్టా మల్లేసు, పిట్టా చంద్రపతిరావు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

గల్లంతైన ఒడిశా వ్యక్తి మృతి



నీలమాధవ్ పాత్రో (ఫైల్)

హిరమండలం: ఒడిశా కాశీనగర్‌కు చెందిన నీలమాధవ్ పాత్రో(39) హిరమండలం గొట్టా బ్యారేజీ వద్ద వంశధార నదిలో శవమై కనిపించాడు. కాశీనగర్ బ్రాహ్మణ వీధికి చెందిన నీలమాధవ్ పాత్రో ఈ నెల 25న వినాయక నిమజ్జనోత్సవంలో పాల్గొన్నాడు. వంశధార నదిలో గల్లంతయ్యాడు. కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ కనిపించకపోవడంతో 27వ తేదీన ఒడిశా కాశీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ తరుణంలో శుక్రవారం గొట్టా బ్యారేజీలో 16వ గేట్ వద్ద మృతదేహం కనిపించింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు హిరమండలం పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. అప్పటికే అనుమానంతో గాలింపు చర్యలు చేపడుతున్న కుటుంబ సభ్యులు మృతదేహం నీలమాధవ్ పాత్రోదిగా గుర్తించారు. ఎస్ఐ నారాయణస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యాపారి ఆత్మహత్య



ప్రత్తి రాజేష్

ఇచ్ఛాపురం: అప్పుల బాధ తట్టుకోలేక పట్టణానికి చెందిన వ్యాపారి ప్రత్తి రాజేష్(49) ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ ఎస్ఐ కె.గోవిందరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని దాసన్న పేటకు చెందిన వ్యాపారి ప్రత్తి రాజేష్ గురువారం మధ్యాహ్నం అతని బెడ్‌రూమ్‌లోని వెళ్లి తలుపులు వేసుకున్నాడు. శుక్రవారం ఉదయం ఎంత సేపటికీ గది తలుపులు తెరవకపోవడంతో ఆయన భార్య సునీత ఇంటి బయటకు వచ్చి ఇరుగుపొరుగు వారిని పిలిచారు. వారు బలవంతంగా తలుపులు తెరవగా రాజేష్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని విగతజీవిగా కనిపించాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మందుల దుకాణానికి వెళ్తుండగా..

రణస్థలం: మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డులో శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఒక లారీడ్రైవర్ ఉన్నట్టుండి కుప్పకూలిపోయి ప్రాణాలు వదిలేశారు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాకినాడ జిల్లా ఏలేశ్వరం గ్రామానికి చెందిన తోట కాంతారావు(50) నాలుగు రోజుల కిందట జ్వరంతోనే స్వగ్రామం నుంచి అరటి కాయల లోడుతో ఒడిశా వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రణస్థలం వచ్చేసరికి అనారోగ్యం ఎక్కువ కావడంతో రోడ్డు పక్కన మెడికల్ దుకాణానికి వెళ్దామని బండి ఆపారు. దుకాణం వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా సర్వీస్ రోడ్డులో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న జేఆర్ పురం పోలీసులు మృతదేహాన్ని ఏలేశ్వరం తరలించారు.

పాడి పరిశ్రమను కాపాడుదాం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

- మంత్రి సీదిరి అప్పలరాజు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పాడి పరిశ్రమలను లాభదాయకంగా మార్చాలని, అప్పుడే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారని పశుసంవర్ధక, పాడి, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన జాతీయ లైవ్ స్టాక్ మిషన్ జిల్లా స్థాయి అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా కోళ్లు, మేకలు, గొర్రెలు, పందులు పెంపకానికి 50 శాతం సబ్సిడీ అందిస్తామని, ఈ మిషన్‌ను జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఔత్సాహికులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. యూనిట్ వ్యయంలో సగం సబ్సిడీ అందించడం, 35 శాతం వరకూ లోన్ ఇచ్చే స్కీమ్‌లు కూడా ఉన్నాయన్నారు. ఎంఎస్ఎంఈ ద్వారా రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించే వారికి ప్రభుత్వ పరంగా మంచి ప్రోత్సాహకాలు ఉన్నాయని, మంచి లక్ష్యంతో ముందుకు వచ్చే వాళ్లకి తాము ఎప్పుడూ అండగా నిలుస్తామని చెప్పారు. జిల్లా గొర్రెలు, మేకలు పెంపకం దారుల సహకార సంఘం ఇటీవల నియామకం జరిగింది. అధ్యక్షులుగా రాపాక చిన్నారావు, సభ్యులు బూర పాపారావు, పైసాగి అప్పలస్వామిలను అభినందించారు. అనంతరం పశు పోషణ ముఖ్యాంశాలు పేరిట ముద్రించిన పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ యాదవ సామాజిక వర్గం ఇలాంటి పథకాలను వినియోగించుకుని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అవినీతికి తావులేకుండా పాదర్శకంగా పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, మన్యం, విజయనగరం జిల్లాల ఈడీ డాక్టర్ పాట్నూరు సూర్యం, అగ్రి మిషన్ సభ్యులు గొండు రఘురాం, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డాక్టర్ శిమ్మ నేతాజీ, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్యకిరణ్, పశుసంవర్ధక శాఖ శ్రీకాకుళం, టెక్కలి డిప్యూటీ డైరెక్టర్లు ఎం. జగన్నాథం, వి.జయరాజు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

హిరమండలం: హిరమండలం మేజర్ పంచాయతీ సుభలయ గ్రామంలో శుక్రవారం సాయంత్రం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. కుక్క దాడిలో గ్రామానికి చెందిన రోకళ్ల నరసమ్మ, పిన్నింటి వరదమ్మ, చిన్నారావు, కె.వసంత్, ఎస్.రవి, జి.గణపతి, పి.కృష్ణ, కె.రాము, జె.అప్పలనాయుడు, బాలరాజుతో పాటు మరో ఐదుగురు కుక్కల దాడిలో గాయపడ్డారు. వీరిలో కొందరు స్థానిక హిరమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స పొందగా మరికొందరు శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి వెళ్లినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ సాయిగీత తెలిపారు. దాడి చేసిన పిచ్చికుక్కను గ్రామస్తులు హతమార్చారు.

వినాయక నిమజ్జనంలో ఘర్షణ

సారవకోట: చీడిపూడి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనంలో ఇరువర్గాలు ఘర్షణ పడటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అప్పారావు తెలిపారు. ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులను నియమించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వీరిని నియమిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

నియోజకవర్గం	మండలం	అధ్యక్షుడి పేరు
ఆమదాలవలస	ఆమదాలవలస	తమ్మినేని శ్రీరామ్మూర్తి
	మున్సిపాలిటి	పాడుగు శ్రీనివాసరావు
	బూర్జ	ఖండాపు గోవిందరావు
	పొందూరు	పప్పల రమేష్
	సరుబుజ్జిలి	బెవర మల్లేశ్వరరావు
ఎచ్చెర్ల	ఎచ్చెర్ల	ముద్దాడ శంకర్
	జి.సిగడాం	బత్తుల సన్యాసిరావు
	లావేరు	దన్నాన రాజినాయుడు
	రణస్థలం	పెద్దింటి మహంతి
ఇచ్ఛాపురం	ఇచ్ఛాపురం	బలివాడ ప్రకాశరావు
	ఇచ్ఛాపురం రూరల్	పతిర్ల రాజశేఖర్‌రెడ్డి
	కంచిలి	వజ్జ మృత్యుంజయరావు
	కవిటి	కడియాల ప్రకాస్
	సోంపేట	సిలగాన భాస్కరరావు
నరసన్నపేట	జలుమూరు	కనుసు సీతారాం
	నరసన్నపేట	లుకలాపు రవికుమార్
	పోలాకి	కణితి కృష్ణారావు
	సారవకోట	వరుదు వంశీరాఘవ
పలాస	మున్సిపాలిటీ	సనపల సింహాచలం
	పలాస	పాయల వెంకటరావు
	మందస	అగ్గున సూర్యారావు
	వజ్రపుకొత్తూరు	పుక్కళ్ల గురవయ్యనాయుడు
పాతపట్నం	హిరమండలం	మీసాల రామకృష్ణ
	కొత్తూరు	సారిపల్లి ప్రసాదరావు
	ఎల్.ఎన్.పేట	పెనుమజ్జి విష్ణుమూర్తి
	మెళియాపుట్టి	పల్లి యోగి
	పాతపట్నం	సవిరిగాన ప్రదీప్
శ్రీకాకుళం	క్లస్టర్–1	చౌదరి సతీష్
	క్లస్టర్–2	పాలకొండ అప్పారావు
	గార	పీస గోవిందరాజులు
	శ్రీకాకుళం రూరల్	చిట్టి జనార్దనరావు
టెక్కలి	కోటబొమ్మాళి	నూక సత్యరాజు
	టెక్కలి	బగాది హరి
	నందిగాం	తమిరి ఫల్గుణరావు
	సంతబొమ్మాళి	బాబూరావు

సాయి స్వర్ణా ప్యాలెస్ ప్రారంభం



ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు స్వాగతం పలుకుతున్న నానాజీ సోదరులు, కుటుంబ సభ్యులు

నరసన్నపేట: స్థానిక మెయిన్ రోడ్డులో పాత ఆంధ్రా బ్యాంకు వద్ద నేతాజీ వీధి ఎదురుగా నూతనంగా నిర్మించిన సాయి స్వర్ణా ప్యాలెస్ బంగారు రిటైల్ షాపును నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం ప్రారంభించారు. 30 ఏళ్లుగా నరసన్నపేటలో బంగారం వ్యాపారం చేస్తూ వినియోగదారుల నమ్మకాన్ని పెంచుతూ వస్తున్న నానాజీ సోదరులు ఈ రిటైల్ షాపును పునర్నిర్మించారు. ప్రారంభోత్సవంలో నానాజీ సోదరులతో పాటు డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ముద్దాడ బైరాగి నాయుడు, రాజాపు అప్పన్న, పాగోటి రాజారావు, వాన గోవిందరావు, కణిత కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.